ప్రజాశక్తి
మంగళవారం 19 డిసెంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

వైసిపి హయాంలో..

ప్రజాస్వామ్యంపై తీవ్ర దాడి

యాత్ర ముగింపు సందర్భంగా పైలాన్ వద్ద లోకేష్, టిడిపి నాయకులు

- వ్యవస్థలన్నీ ధ్వంసం
- కష్టాల్లో ప్రజలు
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు అంగీకరించేది లేదు
- యువగళం పాదయాత్ర ముగింపులో నారా లోకేష్
- చివరి రోజు ఎక్కడికక్కడ ఘన స్వాగతం

ప్రజాశక్తి - గాజువాక, ఉక్కునగరం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యంపై దాడి తీవ్రమైందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ ఏడాది జనవరి 27న ప్రారంభమైన ఆయన యువగళం పాదయాత్ర 226 రోజులపాటు 3132 కిలోమీటర్లు సాగి విశాఖలోని అగనంపూడి శివాజీనగర్ వద్ద ముగిసింది. అక్కడ ఏర్పాటు చేసిన పైలాన్‌ను కార్యకర్తల జయ జయధ్వానాల నడుమ లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలనూ జగన్ ధ్వంసం చేశాడని విమర్శించారు. ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారని తెలిపారు. యువగళం యాత్ర ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకున్నానని అన్నారు. ఉక్కు మిగతా 2లో..

పాదయాత్ర చేస్తున్న లోకేష్

అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీలు

కదంతొక్కిన అంగన్వాడీలు

- ఆర్‌డిఒ కార్యాలయాలు ముట్టడి
- పలుచోట్ల ర్యాలీలు, మానవహారాలు, నిరసనలు

వార్తలు 8లో..

బాబు, పవన్‌ది ఓనర్-కాంట్రాక్టర్ రిలేషన్

మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య ఉన్నది ఓనర్ - కాంట్రాక్టర్ రిలేషన్ మాత్రమేనని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. విశాఖలో. సోమవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ వారిద్దరి మధ్యా ఇప్పటివరకు చీకటి ఒప్పందాలు జరిగాయని, ఇప్పుడు అవి బహిర్గతం మిగతా 2లో..

గుప్త నిధులు తవ్వకాల కలకలం

వార్త మెయిన్‌లో..

సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల నిరసనలు

వార్త 6లో..

సమస్యలపై విద్యుత్ కార్మికుల ధర్నా

వార్త 2లో..

కాలుష్య రహిత విశాఖే లక్ష్యం

జివిఎంసికి సైకిల్‌పై వస్తున్న కమిషనర్

కమిషనర్ సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాలుష్య రహిత విశాఖనే తమ లక్ష్యమని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ఎకో-జీరో పొల్యూషన్ నేపథ్యంలో అనేక కార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో సోమవారం తప్పకుండా ప్రజా రవాణాను వినియోగించాలని జివిఎంసి కోరుతోందన్నారు.

ఆ పిలుపునకు తాను సైతం అంటూ సోమవారం కమిషనర్ జివిఎంసి ప్రధాన కార్యాలయానికి సైకిల్ పై విధులకు హాజరై పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో రోజు రోజుకూ కాలుష్యం పెరుగుతుండటంతో నగర పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రణాళికలు రచించామన్నారు.

జిందాల్‌తో చీకటి ఒప్పందాన్ని బయటపెట్టాలి

- స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీసే కుట్రలను కేంద్రం ఆపేయాలి
- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జిందాల్ స్టీల్‌తో జరిగిన చీకటి ఒప్పందాన్ని బహిర్గతం చేసి, విశాఖ ఉక్కును పూర్తి స్థాయి సామర్థ్యంతో నడిపే చర్యలను వెంటనే చేపట్టాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి ఎన్‌పిఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును స్ట్రాటజిక్ సేల్ పేరుతో వంద శాతం అమ్మకానికి పెట్టిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్లాంటును, కార్మికులను సంక్షోభంలోకి నెడుతోందన్నారు. సంవత్సరానికి 2 లక్షల టన్నులు ఉత్పత్తి చేసే బ్లాస్ట్ ఫర్నేస్ 3ని రెండు సంవత్సరాలుగా మూసి వేశారన్నారు. ఏడాదికి కోటి టన్నులు ఇనుప ఖనిజం ప్లాంటుకు అవసరం ఉందన్నారు. దీనిని కిరండోల్, బచేరీ, బైలదిల్లా గనుల నుంచి ఇంతవరకూ సరఫరా చేసేవారని, ఈ ఏడాది 40 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు. ఆ గనులు ప్రైవేటు వారికి ఇచ్చి స్టీల్‌ప్లాంట్‌కు బళ్లారి, దోనమలై గనుల నుంచి ఖనిజం తెచ్చుకోమంటున్నారన్నారు. దీని వల్ల రవాణా, ఉత్పత్తి ఖర్చు పెరిగి ప్లాంటు నష్టాల్లోకి పోతుందని తెలిపారు. బ్లాస్ట్ ఫర్నేస్‌ను నడపాలనే పేరుతో జిందాల్ స్టీల్‌తో రహస్య మంతనాలు జరపడం తగదన్నారు. బైలదిల్లా గనుల నుంచి ఖనిజం ఎందుకు ఇవ్వరు ?, జిందాల్‌ను ఎందుకు రంగంలో దించుతున్నారు ? అని జగ్గునాయుడు ప్రశ్నించారు. ఇన్ని కష్టాల్లోనూ ఈ సంవత్సరం గత తొమ్మిది నెలల్లో ప్లాంటు 19 వేల కోట్లు టర్నోవర్ సాధించిందని తెలిపారు. అయినప్పటికీ 4500 మంది ఎగ్జిక్యూటివ్స్‌కు ఈ నెల 50 శాతం మాత్రమే జీతాలు చెల్లించారని, నాన్ ఎగ్జిక్యూటివ్‌కు జీతాలు కష్టమని బెదిరిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు మిగతా 2లో..

మాట్లాడుతున్న జగ్గునాయుడు, పక్కన కుమార్

మొదటి పేజీ తరువాయి..

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని కోరుతున్న యువతులు

ప్రజాస్వామ్యంపై తీవ్ర దాడి

నగరంలోని సిడబ్ల్యుసి-1 నుంచి సోమవారం ఆయన యాత్ర ప్రారంభమై నెహ్రూ పార్కు, తెలుగు తల్లి విగ్రహం, వై.జంక్షన్, గంగవరం పోర్టు, చినగంట్యాడ, జగ్గు జంక్షన్, వడ్లపూడి, కూర్మన్నపాలెం మీదుగా అగనంపూడి వరకూ సాగింది. యాత్రలో లోకేష్ వెంట తల్లి నారా భువనేశ్వరి, అత్త నందమూరి వసుంధరా దేవి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ అధ్యక్షులు కిమిడి కళావెంకట్రావు, ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త ప్రత్తిపాటి పుల్లారావు, నాయకులు శ్రీభరత్, కొల్లు రవీంద్ర, పల్లా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

లోకేష్‌ను కలిసిన విశాఖ ఉక్కు నిర్వాసితులు

విశాఖ ఉక్కు నిర్వాసితుల ఐక్యవేదిక ప్రతినిధులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యలను చెప్పుకున్నారు. అందుకు ఆయన స్పందిస్తూ ఎంతో చరిత్ర కలిగిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవంతో ముడివడి ఉన్న ఇటువంటి ప్రతిష్టాత్మకమైన సంస్థను ప్రైవేటీకరణ చేస్తుంటే కేసులకు భయపడి జగన్మోహన్ రెడ్డి నోరు మెదపడం లేదన్నారు. కొందరు బడా పారిశ్రామికవేత్తలతో కుమ్మక్కై, ఖాళీగా ఉన్న సుమారు 8 వేల ఎకరాల భూములను అడ్డగోలుగా దోచుకునేందుకు జగన్ వ్యూహరచన చేశారన్నారు. ఐదు కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి జగన్ రెడ్డి కమీషన్ల కోసం, ప్లాంట్‌లో వాటాల కోసం ఆరాటపడడం అత్యంత దుర్మార్గమన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై పార్లమెంటులో గళం వినిపిస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అంగీకరించబోమని స్పష్టం చేశారు. నిర్వాసితులకు అన్యాయం జరగకుండా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. లోకేష్ యాత్రకు చివరి రోజు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. వేలాది మంది తెలుగుదేశం అభిమానులు పాల్గొన్నారు. పూలవర్షం కురిపించారు.

జిందాల్‌తో చీకటి ఒప్పందాన్ని బయటపెట్టాలి

కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. 19 వేల కోట్ల టర్నోవర్‌కుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంవత్సరానికి కర్మాగారం రూ.250 కోట్లు జిఎస్‌టి చెల్లించిందని గుర్తు చేశారు. అలాగే ఎన్ఎండిసికి రూ.2 వేల కోట్లు అప్పులు తీర్చారని, బ్యాంకులకు రుణాలు, వడ్డీలు కడుతున్నారని తెలిపారు. కానీ సంస్థను నడిపిస్తున్న ఉద్యోగులను ఎండగడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్లు రుణమాఫీ చేయడానికి చేతులు వచ్చాయిగానీ, లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కుకు మాత్రం రూ.5 వేల కోట్లు ఇవ్వడానికి రాలేదని, ఇది తీవ్ర ద్రోహమని అన్నారు. కేంద్రం ఇంత ద్రోహానికి పూనుకుంటే ఎందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నిలదీయడం లేదని, ప్లాంటును కాపాడే కృషి ఎందుకు చేయడం లేదని జగ్గునాయుడు ప్రశ్నించారు. బిజెపి మిత్రపక్షం జనసేన, జనసేన మిత్రపక్షం తెలుగుదేశం పార్టీలు కూడా ప్లాంటు రక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి వద్ద జరుగుతున్న దీక్షలు ఈ నెల 27వ తేదీకి వెయ్యి రోజులకు చేరుకుంటున్నాయని, ఈ సందర్భంగా ఆ రోజు ఉదయం 10 గంటలకు రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుంచి జివిఎంసి దీక్షా శిబిరం వరకు భారీ ప్రదర్శన జరుగుతుందని అన్నారు. ఈ ప్రదర్శనలో కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని మోడీ ప్రైవేటీకరణ విధానాలను ప్రతిఘటించాలన్నారు.

బాబు, పవన్‌ది ఓనర్-కాంట్రాక్టర్ రిలేషన్

అవుతున్నాయని అన్నారు. కొంతకాలం వరకు పవన్ కల్యాణ్ విస్తృతంగా రాష్ట్రమంతా పర్యటిస్తున్నప్పుడు ఆయన ముఖ్యమంత్రి అవుతాడని కాపు సామాజిక వర్గం అభిప్రాయపడిందని, అయితే పవన్ చంద్రబాబుతో మిలాకత్ కావడంతో ఆ సామాజిక వర్గం పవన్‌పై అభిప్రాయాన్ని మార్చుకుందని అన్నారు. చంద్రబాబు ఆది నుంచీ కాపు ద్రోహి అని వంగవీటి రంగా హత్యతోనే ఇది రుజువైందని తెలిపారు. ముద్రగడ పద్మనాభంను హతమార్చాలన్న చంద్రబాబు వ్యూహంతో కాపులంటే ఆయనకు ఎంత ద్వేషమో అర్థం అవుతుందని అన్నారు. చిరంజీవిని కూడా ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉన్ననీయకుండా పన్నాగం పన్నింది చంద్రబాబు, పవన్ కల్యాణ్ అని అమర్‌నాథ్ ఆరోపించారు. లోకేష్ పాదయాత్ర గురించి మాట్లాడుతూ ఆ పాదయాత్రకు ప్రజల నుంచి పెద్దగా స్పందన లేదని తెలిపారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో వివిధ వార్డులలో రకరకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పది మందికి ఒక్కొక్కరిరీ రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని తన సొంత నిధుల నుంచి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు. సోమవారం బాధితుల ఇళ్లకు వెళ్లి వారికి ఆ మొత్తాలను పంపిణీ చేశారు.

సమస్యలపై విద్యుత్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, షిఫ్ట్ ఆపరేటర్లు, మీటర్ రీడర్లు, సెక్షన్ ఆపరేటర్లు, స్టోర్స్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రీన్ పార్క్ ఎదురుగా ఉన్న ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఆఫీస్ వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి తమ పాదయాత్రలోనూ, అసెంబ్లీలోనూ విద్యుత్ కార్మికులు విపరీత దోపిడీకి గురవుతున్నారని, తాను అధికారంలోకి వస్తే దళారీ వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్ట్ కార్మికులందరినీ దశలు వారీగా సంస్థలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ నాలుగున్నర సంవత్సరాలు గడిచినా నేటికీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. మీటరు రీడర్స్‌కు పీసురేటు విధానాన్ని రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలని కోరారు. గతంలో మాదిరిగానే 15 రోజులు బిల్లింగ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పని దినాల కుదింపును వెంటనే ఆపాలని కోరారు. స్టోర్స్‌లో పనిచేస్తున్న హమాలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచుతూ నెలవారీ జీతాలు పెంచాలన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు, విద్యుత్ కార్మికులు

వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హత బట్టి సంస్థలో విలీనం చేయాలని కోరారు. అనేక సంవత్సరాల నుండి ప్రాణాలకు తెగించి పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని, అప్పటి వరకూ డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా నియమించిన షిఫ్ట్ ఆపరేటర్లకు పాత ఆపరేటర్స్‌తో సమానంగా జీతాలు చెల్లించాలని కోరారు. స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రతిపాదనను విరమించాలన్నారు. ధర్నా అనంతరం ఎస్ఇ. ఇన్‌చార్జికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సత్యారావు, ప్రేమ్ చంద్రశేఖర్, షిఫ్ట్ ఆపరేటర్ల విభాగం నాయకులు ఎన్.అవతారం, మీటర్ రీడర్ల నాయకులు పోలారావు, కనకరాజు, అప్పారావు, రాజు, భాను, స్టోర్స్ హమాలీలు కనకరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత ఆశయాలకు అద్దంపట్టేలా యువగళం సభ

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర బహిరంగ సభను చరిత్రలో నిలుపుదామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. యువత ఆశయాలకు అద్దంపట్టే ప్రజాగళంగా ఆ సభను నిర్వహిస్తామని వెల్లడించారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం బహిరంగ సభలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, లోకేష్‌తో పాటు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో ఓ దుర్మార్గుడు ముఖ్యమంత్రిగా ఉన్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు ఏ సమావేశాలు, కార్యక్రమాలు చేసుకున్నా, భయంతో అవి జరగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నాడని అన్నారు. ఇటువంటి సందర్భాలు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడూ లేవన్నారు. విశాఖలో ఈ సభ జరపాలని ఆంధ్ర యూనివర్సిటీ స్థలానికి

మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

దరఖాస్తు చేస్తే అధికార బలంతో ఇవ్వకుండా చేశారని విమర్శించారు. సభ కోసం ఆర్టీసీ బస్సులను, ప్రైవేటు కళాశాలల బస్సులను కూడా ఇవ్వకుండా చేశారని తెలిపారు. ఎన్ని ఆటంకాలు పెట్టినా సభ దిగ్విజయంగా జరుగుతుందని అన్నారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడు, అశోక్ గజపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష' సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడం సరికాదని, వెంటనే వారి జీతాలు చెల్లించి, మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమగ్ర శిక్ష సిబ్బంది పోరాటానికి యుటిఎఫ్ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

జాబ్ కేలండర్ ఏదీ ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం రెండు లక్షలా 30 వేల ఉద్యోగాలకు తక్షణం నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జాబ్ కేలండర్ ఏదీ ? అని నినదించారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామారావు, నిరుద్యోగ జెఎసి రాష్ట్ర కన్వీనర్ సిద్ధిక్ మాట్లాడారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేయడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీను, ఎఐవైఎఫ్ నాయకులు చరణ్, సూర్య, కిరణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి 'సంపూర్ణ' హెయిర్ ఆయిల్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మారికో ప్రీమియం హెయిర్ న్యూరిష్‌మెంట్ బ్రాండ్ పారాచూట్ అడ్వాన్స్‌డ్ కేశ సంరక్షణలో భాగంగా సంపూర్ణ హెయిర్ ఆయిల్‌ను విడుదల చేసినట్టు మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ అవస్తి తెలిపారు. ప్రముఖ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంపూర్ణ కోకోనట్ హెయిర్ ఆయిల్ వినియోగదారులకు ఒత్తైన, పొడవాటి, నల్లని జుట్టును అందించడంలో తిరుగులేని పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. శిరోజ సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి దోహదపడుతుందన్నారు.

IN THE HONOURABLE COURT OF THE IIIrd ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.751/2023

Between:
Lakshmi Finance Private Limited Rep.by its SPA Holder Kondra Anand .... Plaintiff
And :
Yaranagula Jagan Mohan & another ... Defendants

SUMMONS

To,
D-1. Yaranagula Jagan Mohan, S/o Jaganadha Rao, Flot No. A1, Sai Padmalaya Towers, Wood Peta, Anakapalli (Mandal), Near: Rama Chandra Theater, Visakhapatnam District-531001.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with sub sequent interest and costs, other relief's and the suit stands posted to **29-12-2023** for your appearance. You are hereby required to appear before the Honourable court either in person or through duly instructed Advocate on **29-12-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, ex-parte as perlaw.

(By Order of the Honourable Court)

TULALA VENKATESWARA RAO, KURUMUJI KOTESWARA RAO,
ADVOCATES,
Visakhapatnam-530002

IN THE HON'BLE COURT OF THE I ADDL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A.No.749/2023,O.S 216/2023

Between:
Smt.KOTIPALLI PADMA ...Plaintiff
And
Sri.CHEDALAVADA RAVICHAND & 2 others ...Defendants

SUMMONS

To,
Defendant No.1: CHEDALAVADA RAVICHAND S/o. Ramakrishna Rao, Aged 55 Years, D.no. 15-15-43/22, flat 304, PrathimaParadise, Krishna Nagar-01, Maharani Peta, Visakhapatnam-530002.

Please take the notice by way of this publication, Whereas the above-named PLAINTIFF instituted the above noted O.S. 216/2023 before the Hon'ble I Addl. Senior Civil Judge Court at Visakhapatnam suit for Injunction in favour of the plaintiff. As per the directions of the Hon'ble I Addl. Senior Civil Judge District Court at Visakhapatnam you are hereby summoned to appear in this Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the said claim, on 05-01-2024 at 10:30 A.M. also take notice that in default of your filing an address for service before the day aforementioned. You are liable to have your defence struck out take notice that in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)

PN.Lakshman Ravi Kumar & K.S.R.Murthy
Advocates. D.No. 9-19-20/A, C.B.M.Compound, Behind Sampath Vinayaka Temple, Visakhapatnam - 530003
Cell. No.7013727667

పెన్‌డౌన్ నిరసనలో పాల్గొన్న సమగ్రశిక్ష ఉద్యోగులు

- మూడురోజులుగా పెన్‌డౌన్ నిరసన
- 20నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం

సమస్యలను పరిష్కరించాలని

సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరుబాట

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎన్నికల్లోనూ, పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలు, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు పోరుబాట పట్టారు. నాలుగున్నరేళ్లకు పైగా ప్రభుత్వం తమకిచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని ఎంతో ఆశగా చూసి, పలుమార్లు విజ్ఞప్తులు చేసి, వినతులు అందజేయడంతోపాటు అపుడపుడూ నిరసనలు చేపట్టినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈనెల 16నుంచి పెన్‌డౌన్ నిరసన చేపట్టారు. అప్పటికీ స్పందించకుంటే ఈనెల 20 నుంచి నిరవధిక సమ్మెకు సమాయత్తమౌతున్నారు.

సమగ్ర శిక్ష అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పోరుబాట పట్టారని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెండింగులో ఉన్న సెప్టెంబర్, అక్టోబర్ నెలల జీతాలు అందజేసింది. తమ సమస్యల పట్ల కంటితుడుపు చర్యలు సరికాదని వీరంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన వాగ్దానం మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం చెల్లింపు, బీమా సదుపాయం ఇతరత్రా కోర్కెలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పోరుబాట పట్టారు.

భీమిలి మండలంలో ఎంఆర్‌సి కేంద్రంగా 33 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఆరుగురు క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 17 మంది ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటిలు, భవిత కేంద్రంలో ముగ్గురు ఐఆర్‌టిలు, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్, ఎంఐఎస్,ఇంకొంతమంది ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు.

విద్యా పథకాల అమలులో కీలకం..

విద్యా సంబంధిత పథకాల అమలులో సమగ్ర శిక్ష ఉద్యోగులే కీలకం. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో 15 నుంచి 20 పాఠశాలలకు నిరంతరం వెళ్లి అక్కడ అమలవుతున్న అమ్మఒడి, ఇతర పథకాల అమలు, సకాలంలో పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు యూనిఫాం, ట్యాబ్‌లు అందజేయడంలో వీరే కీలకం.

బడి బయట ఉన్న బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. మండలంలోని సిఆర్‌పిలంతా ఎంఎ,బిఇడి పూర్తి చేసినవారే. ప్రభుత్వం అధీనంలో సమగ్రశిక్షలో పనిచేస్తే, ఏనాటికైనా తమ సేవలను గుర్తించి రెగ్యులర్ చేస్తారని, కనీస వేతన అమలు చేసారన్న ఆశతో అరకొర వేతనాలతోపనిచేస్తున్న వీరికి ఇచ్చిన హామీ అమలు చేయకుండా మొండిచేయి చూపిన ప్రభుత్వ తీరును నిరసిస్తూఉద్యమబాట పట్టారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నెలకు రూ.వెయ్యి జీతానికి ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగంలో చేరాను. ఎన్నో పోరాటాలతో రూ 14,203 లకు జీతం చేరింది. ఏటా ఏప్రిల్ నెలాఖరున కొత్తగా ఉద్యోగంలో చేరుతున్నట్లు అగ్రిమెంట్ చేస్తున్నారు. దీంతో సర్వీస్, అనుభవం పరిగణనలోకి రాదు. ఇప్పటికైనా ఉద్యోగ భద్రత కల్పించాలి.

టి నరసింగరావు, ఆఫీస్ సబార్డినేట్, భీమిలి

సేవలకు గుర్తింపు లేదు..

విద్యా సంబంధిత పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్నాం. బడి ఈడు పిల్లలందరికీ పాఠశాలల్లో చేర్పించడంలో కృషి చేస్తున్నాం. మేం చేసిన సేవలకు గుర్తింపు లేకపోవడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి

టి.త్రినాధ్, సిఆర్‌పి, భీమిలి

నేరాలు ఘోరాలు

సముద్రంలో బోటు బోల్తా

మత్స్యకారుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఎస్.రాయవరం : చేపల వేటకు వెళ్తూ బోటు బోల్తా పడిన ఘటనలో మత్స్యకారుడు మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున మత్స్యకార గ్రామమైన కొత్తరేవుపోలవరంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాలివి. .కొత్తరేవుపోలవరం గ్రామానికి చెందిన బొడ్డు నూకరాజు (50) చేపలవేటకు సోమవారం వేకువజామున బయలుదేరగా,.అలల ఉద్ధృతికి బోటు బోల్తా పడటంతో సముద్రంలో పడి మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు, మృతదేహానికి పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తత

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ రామచంద్రరావు

ప్రజాశక్తి -అనందపురం: రోడ్డు ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక సిఐ రామచంద్రరావు సూచించారు. సోమవారం ఆనందపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ఇటీవల విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. పాఠశాలకు ఆటోలో, బస్సుల్లో వెళ్లి వచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చోవడం, ఆటోకు ఇరుపక్కలా, వెనుకన వేలాడుతూ ప్రయాణించడం ప్రమాదకరమన్నారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించే ఆటోల్లో ప్రయాణించవద్దని, అటువంటివి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు దాటేటప్పుడు, రోడ్డుపై నడిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆటోలో ఒంటరిగా ప్రయాణించ రాదన్నారు.

పనిచేసే వారికి గుర్తింపు



మాట్లాడుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి -మధురవాడ : కష్టబడి పనిచేసే వారికి జనసేన పార్టీలో గుర్తింపు ఉంటుందని రూరల్ జిల్లా కమిటీలో భీమిలి నియోజకవర్గం నుంచి స్థానం దక్కిన జిల్లా ఉపాధ్యక్షుడు ఇఎస్ఎన్.చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా బివి.కృష్ణయ్య, కార్యదర్శిగా మజ్జి శ్రీను, సంయుక్త కార్యదర్శి బిటిడి.శ్రీకాంత్ అన్నారు.

సోమవారం ఎండాడలోని జనసేన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీ తమపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. రూరల్ జిల్లా కమిటీలో తమకు కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్, పిఎసి చైర్మెన్ నాదెండ్ల మనోహర్, రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, భీమిలినియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నేత శాఖరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ నెల 20న పోలిపల్లిలో నిర్వహించనున్న లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు విజయోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని కుసులువాడ శివాలయంలో సుబ్రహ్మణ్యషష్టి సందర్భంగా సోమవారం లక్ష దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుసులువాడ, గొట్టిపల్లి, రామునేని పేట, ముకుందపురం, రాగానిగూడెం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు, భజనలు, కోలాటం నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో రెండు వేలమందికి పైగా అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శివాలయంలో లక్ష దీపోత్సవంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తి అలవరచుకోవాలి

మాట్లాడుతున్న వైసిపి నేత దేవన్‌రెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : గెలుపోటములు కంటే విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవరచుకోవాలని గాజువాక నియోజకవర్గ వైసిపి నేత తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. సోమవారం 87వ వార్డు కణితి హైస్కూల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులకు జాతీయస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ, క్రీడలతో విద్యార్థుల్లో టీం వర్క్, నాయకత్వ లక్షణాలతోపాటు ఒత్తిడి తట్టుకునే సామర్థ్యం పెంపొందుతుందన్నారు. నిబద్ధతతో ఆడాలని, గెలుపోటములను ఒకేలా స్వీకరించాలన్నారు. క్రీడల్లో రాణించి, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడంతోపాటు పాఠశాలకు, జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 87వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, కోమటి రమాదేవి, చిత్రాడ రమణ, జెర్రిపోతుల ఈశ్వరరావు, బుగిది రామలక్ష్మి, సోక్కర రమణ, పసుపులేటి రంగారావు, కణితి శంకరరావు, కర్రి అంజి, బొడ్డు సుమంత్, కాండ్రేగుల మనోహర్, కణితి హైస్కూల్ హెచ్‌ఎం సూర్య ప్రకాష్, పీడీ మన్నాజీ, నారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు..

గీతంలో ఐసిసి వార్షిక సమావేశాలు

సమావేశాలను ప్రారంభిస్తున్న గీతం విసి

ప్రజాశక్తి- మధురవాడ : కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థలలో ఏటా నిర్వహించే ఇండియన్ కంట్రోల్ కాన్ఫడెన్స్ (ఐసిసి) 9వ వార్షిక సమావేశాలను సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రారంభించారు. గీతం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం పాల్గొని, గీతం వర్సిటీ పరిశోధనలకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్. విజయశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశాలలో సైన్స్, ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు నిపుణుడు, ఐఐటి హైదరాబాద్ విశిష్ట ప్రొఫెసర్ ఎమ్.విద్యాసాగర్ ప్రసంగించారు. మూడు రోజుల పాటు జరిగే సమావేశాలలో దేశ, విదేశాలకు చెందిన 150 మంది సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. యంత్రాలను పనిచేయించడంలో కంట్రోల్ ఇంజనీరింగ్, అప్లైడ్ మేథమెటిక్స్ అంశాలను చర్చించడంతో పాటు డ్రోన్ హార్డ్‌వేర్ పరిజ్ఞానం, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అంశాలపై ప్రముఖల ప్రసంగాలను ఏర్పాటు చేశారు. ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం, పర్డ్యూ విశ్వవిద్యాలయాలతో పాటు దేశంలోని ఐఐటిలు నుంచి పరిశోధకులు హాజరయ్యారు. టిసిఎస్ రీసెర్చ్, ఎడ్యూటెక్, క్వాలిసిస్,, మేథ్‌వర్క్స్ వంటి ప్రముఖ పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు

సేవా సంఘానికి అభినందన



అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరిస్తున్న సంఘ సభ్యులు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 40వ వార్డు, ఎకేసీ కాలనీలో నూతనంగా ఎన్నికైన రాంజీ భీమ్‌రావ్ ఎస్‌సి సేవా సంఘం కార్యవర్గ సభ్యులను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు (జిఎన్ఆర్) సోమవారం అభినందించారు. నూతన కార్యవర్గసభ్యులను జిఎన్ఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంఘానికి తన సహకారం, మద్దతు ఎల్లపుడూ ఉంటుందన్నారు. ప్రజల మన్ననలు పొందేలా నూతన కార్యవర్గం పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దేబార్కి కృష్ణ, కార్యవర్గ సభ్యులు జామి కృష్ణ, తంబూరి గణేష్, వందన నాగరాజు, తంప మోహన్, దేబర్కి రాంప్రసాద్, విమల, యశోద, సత్యవతి, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

బహుమతులు అందజేస్తున్న ఇఇ పోలాకి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు నేతృత్వంలో డిఇఇ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జివిఎంసి ఆరో వార్డు పిఎం.పాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని సృజన పాఠశాల విద్యార్థులకు సోమవారం విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు, పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మణి, ఉపాధ్యాయులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మూడవ జోన్ మధురవాడ ఇఇ పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ ఆదాతో భావితరాలకు భరోసానివ్వాలని కోరారు. దీనిపై గ్రామాలు, పల్లెల్లోని ప్రజలు, రైతులను, ముఖ్యంగా మహిళల్లో చైతన్యం తీసుకొచ్చే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు విద్యుత్ పొదుపుపై వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లవరాజు, ఎడిఇ కిరణ్‌కుమార్, ఎఇ సురేష్ పాల్గొన్నారు.

ఆదర్శ రాయల్ పాఠశాలకు అవార్డు

అవార్డు స్వీకరిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

ప్రజాశక్తి -ములగాడ : దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనపరుస్తున్న పాఠశాలలకు బ్రెయిన్ ఫీడ్ సంస్థ అందిస్తున్న పురస్కారానికి చింతలలోవ ఆదర్శ రాయల్ విద్యాలయ్ ఎంపిక కావడంపై పాఠశాల ప్రిన్సిపల్ దాసరి వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ హైటెక్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అవార్డును స్వీకరించినట్లు తెలిపారు. పాఠశాలలో చదువుతోపాటు ఆటలు, యోగా, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి సేవా కార్యక్రమాలు, క్రమశిక్షణ ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేసిన అవార్డుల్లో తమ పాఠశాల చోటు దక్కించుకోవడం వెనుక యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల కృషి ఉందన్నారు.

భాగ్యలక్ష్మికి జీవన సాఫల్య పురస్కారం

అవార్డుతో భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -ములగాడ: జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ 'స్త్రీ వన్ ఇండియా ఏటా ఇచ్చే వుమెన్ అచీవర్స్ అవార్డును ఎన్‌సిసి జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎన్ భాగ్యలక్ష్మిని వరించింది. ఆదివారం విశాఖ నోవాటెల్‌లో 2023వ సంవత్సరానికిగాను దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 26 మంది మహిళలకు ఈ అవార్డులను అందజేశారు. 30ఏళ్లుగా విద్య, యువజన, సామాజిక, సేవా రంగాల్లో భాగ్యలక్ష్మి చేసిన విశేష కృషికి గుర్తింపుగా జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డు ప్రదానోత్సవ వేడుకలో మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి,సెయింట్ ఆన్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ సిస్టర్ ట్రిసా మేరీ, సంస్థ వ్యవస్థాపకురాలు స్టెల్లా మైకేల్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా అభివృద్ధి పనులు పూర్తి

అధికారులకు జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశం

అభివృద్ధి పనులపై సూచనలు చేస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐదవజోన్ అక్కయ్యపాలెం, గిరి ప్రదక్షిణ రోడ్డు, సీతమ్మధార సత్యం జంక్షన్ రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.. దొండపర్తి జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం మీదుగా నేషనల్ హైవే వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, సెంటరింగ్, అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డు వద్ద కూడలి అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు మందకొడిగా సాగుతుండడంపై అసంతృప్తి వ్యక్త చేశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న పలు విద్యుత్ స్తంభాలను మార్చివేయాలని, ఆక్రమణలను తొలగించాలని పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ ఎసిపి రామకృష్ణలను ఆదేశించారు. అనంతరం మర్రిపాలెం జంక్షన్ మారియట్ హోటల్ నుండి మాధవధార, మురళీనగర్ మీదుగా సీతమ్మధార అల్లూరి జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ, కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, సెంటర్‌మీడియన్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుపై అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఇ.వేణుగోపాల్‌ను ఆదేశించారు. అల్లూరి జంక్షన్ నుండి సత్యం జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, కాలువ నిర్మాణం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇఇ మత్స్యరాజు, ఎంఎహెచ్ఒ డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై అవగాహన

ప్రొఫెసర్ రాజును సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి - మధురవాడ: స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర అంశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులను అమెరికాలోని ప్రసిద్ధ కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ బల్క్ సొలిడ్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ దండు రాజు అవగాహన కల్పించారు. సోమవారం గీతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఆయా అంశాల్లో వస్తున్న మార్పులను సమగ్రంగా వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసారు. అనంతరం గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్, ఇతర విభాగాలను సందర్శించారు. గీతం విశ్వవిద్యాలయం విద్యార్థులకు మేథో సహకారాన్ని అందిస్తామని భరోసానిచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ విజయశేఖర్, మెకానికల్ ఇంజనీరింగ్ అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు 'ఇసుజు' నైపుణ్యాభివృద్ధి శిక్షణ



ఫోర్‌స్ట్రోక్ ఇంజిన్ ప్రారంభిస్తున్న రాజేష్ మిట్టల్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్ అండ్ ఇండస్ట్రీ సెల్ ఆధ్వర్యంలో ఇసుజు కార్ల మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ సోమవారం విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణనిచ్చారు. ఇసుజు కంపెనీ ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ ఫోర్‌స్ట్రోక్ కట్ సెక్షన్ ఇంజనును ప్రారంభించి, మిషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో డిప్లమో విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంలో కీలకపాత్ర పోషిస్తారని, వీరికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులకు ఇసుజు కంపెనీ ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.మహేశ్వరరావు, డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన జంతు ఆరోగ్య సదస్సు

సమావేశంలో పాల్గొన్న జూ వైద్యులు, అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో జంతువుల ఆరోగ్యంపై సమీక్ష, సిబ్బందికి అవగాహన కల్పించే జంతుఆరోగ్య కమిటీ రెండు రోజుల సమావేశాలు సోమవారం ముగిసాయి. జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, జూఅధికారులు విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ పురుషోత్తం, జూ అసిస్టెంట్ వెటర్నరీ వైద్యులు డాక్టర్ కరుణాకరణ్, వెటర్నరీ, లాబొరేటరీ, పశుసంవర్ధక శాఖల వైద్యులు సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జూ పార్కులో జంతువుల ఆరోగ్య పరిస్థితి, వాటి ఆహార నియమాలపై క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా వివరించారు. జూ పార్కులో భద్రతా చర్యలు, జంతు ఆరోగ్య సంరక్షణపై యానిమల్ కీపర్స్‌కు శిక్షణపై డాక్టర్ నవీన్, డాక్టర్ మనోహర్ వివరించారు. అనంతరం జంతువుల ఆరోగ్యం, ఎన్‌క్లోజర్లపై విశ్లేషణ, తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా జంతు సంరక్షకుల సందేహాలను నిపుణుల కమిటీ నివృత్తి చేసింది. కార్యక్రమంలో జూ అధికారులు మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపాల నాయుడు, గోపి పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దు కోరుతూ
న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : రాజ్యాంగ విరుద్ధమైన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్‌తో విశాఖ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈనెల 25 వరకు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు తెలిపారు. సోమవారం జరిగిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. చేశారు భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని గడచిన 25రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు వివిధ రకాలుగా నిరసనలు, ఆందోళనలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆందోళనను తీవ్రతరం చేసే చర్యల్లో భాగంగా సోమవారం నుంచి వారం రోజులపాటు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు వెల్లడించారు. పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ ఇటు ప్రజలకు, అటు న్యాయవాదులకు ఇబ్బందికరమైన భూహక్కు చట్టాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

బిటి రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 48,49 వార్డుల పరిధిలో రూ.2.16కోట్లతో ఊర్వశి జంక్షన్ నుంచి బర్మా క్యాంప్, శ్రీనివాసనగర్ మీదుగా మధుసూదననగర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న 40 అడుగుల బిటి రోడ్డు విస్తరణ పనులనుఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు పరిశీలించారు. 'గుడ్ మార్నింగ్ నార్త్' కార్యక్రమంలో భాగంగా జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, 48వార్డు ఇంచార్జ్ నీలి రవితో కలిసి ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి హామీనిచ్చారు. డిఇఇ భరణి, టిపిఒ విజయ్ కుమార్, ఎఇలు మోహన్, రాధిక, సాయినాథ్, డైరెక్టర్ రాయుడు శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, క్రాంతి రామారెడ్డి, రాజాన గంగరాజు, బూలోక్, రుత్తల రాంబాబు, అప్పారావు, పి.పద్మ, శంకర్, నరేష్, రాఘవులు, హేమంత్, జాన్సన్, భరత్, రాజేష్, సిహెచ్ శ్రీను పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

నేరెళ్లవలసలో బోరు ప్రారంభిస్తున్న కొండబాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం: మారుమూల గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని జివిఎంసి నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు హామీ ఇచ్చారు. సోమవారం వార్డు పరిధిలోని కె నగరపాలెం సచివాలయం చేపల తిమ్మాపురం, రెడ్డి కాలనీ, అలాగే నిడిగట్టు సచివాలయం పరిధి నేరెళ్లవలస గ్రామాల్లో చెరో మంచినీటిబోరును కార్పొరేటర్ దౌలపల్లి కొండ బాబు ప్రారంభించారు. వైసిపి నేతలు జగన్నాథ అప్పారావు, ఎం.చిన్నారావు, సురేష్, మహిళలు పాల్గొన్నారు

స్పందనకు ఒకే ఒక్క దరఖాస్తు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గ్రీవెన్స్ సెల్ 'స్పందన' నానాటికీ తీసికట్టుగా మారుతోంది. స్థానిక జివిఎంసి ఒకటో జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు ఒకేఒక దరఖాస్తు వచ్చింది. జెడ్‌సి బి.రాము స్పందనలో పాల్గొనగా, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఒక అర్జీ స్వీకరించి, తదుపరి చర్యలకు సంబంధిత విభాగానికి పంపించారు.

వినతిపత్రం స్వీకరిస్తున్న జెడ్‌సి

సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల నిరసనలు

బుచ్చయ్యపేటలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుచ్చయ్యపేట మండల విద్యాశాఖ సమగ్రశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు సోమవారం ఎంఈఓ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీసం హెచ్ఆర్ పాలసీ, ఇచ్చి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్స్‌ను పరిష్కరించకపోతే 20వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీను, రమణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : రాష్ట్ర జాయింట్ ఏక్షన్ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 16 నుంచి ప్రారంభించిన పెన్ డౌవున్ కార్యక్రమం మూడో రోజుకు చేరింది. ఇందులో భాగంగా స్థానిక ఎమ్ ఆర్ సి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. గత రెండు రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు పెన్ డౌన్ చేయడంతో ఎమ్ ఆసుర్ సి కార్యాలయం లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తూ కంప్యూటటర్‌లు మూగపోయి ఉండడంతో కార్యాలయమ వెల వెల పోతుంది. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ రమణ, ఎమ్ మహేష్ కుమార్, ఎన్ కళాభారతి, కె.నాగమణి, బి.భూలక్ష్మి, ఎల్ లావణ్య, ఐ.దీపిక, కె.ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : సమగ్ర శిక్ష అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జేఏసీ) పిలుపు మేరకు దేవరాపల్లి మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం విద్యాశాఖ కార్యాలయం వద్ద ప్లే కార్డులు ప్రదర్శించి నిరసన చేపట్టారు. 16 నుంచి 19 వరకు పెన్ డౌన్, మౌస్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టి ఆందోళన చేస్తామన్నారు. ఈనెల 19వ తేదీ వరకు ప్రభుత్వం స్పందించకపోతే డిసెంబరు 20 నిరవధిక సమ్మెకు దిగుతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, వివి రమణ పి.స్వాతి ప్రియ,సి. హెచ్.రమేష్ ఎం.శ్రీను,పి.గంగాధర్ రావు, కె.మాధవి, ఉపేంద్ర, వై.సాగర్, టి .మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు

భీమునిపట్నం : ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు దయాళ్, త్రినాధ్, వంశీధర్, ఆఫీస్ సబార్డినేట్ టి నరసింగరావు, కంప్యూటర్ ఆపరేటర్ రామభద్రరాజు పాల్గొన్నారు

ఖోఖో పోటీల్లో అలేఖ్యకు గోల్డ్ మెడల్

అలేఖ్య

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 16, 17 తేదీలలో జరిగిన జెఎన్‌టియు జివి అంతర కళాశాలల ఖోఖో పోటీలలో స్థానిక డైట్ విద్యార్థిని బి.అలేఖ్య గోల్డ్ మెడల్ సాధించి ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు అర్హత సాధించారు. డిసెంబర్ 26 నుండి 30 తేదీలలో చైన్నై సెంట్రల్ యూనివర్సిటీలో జరుగు అంతర్ విశ్వ విద్యాలయాల ఖోఖో పోటీలలో అలేఖ్య పాల్గొంటున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బిసిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఖోఖో పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ డాక్టర్ కే పార్వతి, కో ఆర్డినేటర్ కృష్ణ నాగ్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హర్షం తెలియజేసారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : గ్రామాలల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైసిపి కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లిమల్ల ఆచంనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పెద్దమదిన గ్రామంలో వై నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తడి పొడి చెత్త సేకరణకు బుట్టలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కెవిఆర్ నాయుడు, మండల నాయకులు, దాకారపు నాగేశ్వరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్ అభ్యర్థుల వయోపరిమితి 44 ఏళ్లకు పెంచాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రూపు 1, 2 పోస్ట్ అభ్యర్థుల వయో పరిమితిని 44 ఏళ్లకు పెంచాలని, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్నటువంటి రెండు లక్షల 30 వేల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో ఏఐవైఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఏఐవైఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక ఏళ్ల నుండి ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కోసం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనను తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే అభ్యర్థుల వయోపరిమితి మించిపోతున్నందున ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ లో వయోపరిమితిని 42 సంవత్సరాల నుండి 44 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బర్నికాన సాయి, ఎన్ మదన్ మోహన్ రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతుల జాబితా విడుదల

ప్రజాశక్తి -అనకాపల్లి : ఇటీవల తుఫాన్‌లో పంట నష్టపోయిన రైతుల జాబితాను ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తారని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి ప్రభాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట నష్టపోయిన రైతులు జాబితాలను పరిశీలించుకోవాలన్నారు. తమ పేర్లు జాబితాలో లేకపోతే దరఖాస్తులను వ్యవసాయ లేదా ఉద్యానవన సహాయకులకు అందజేసి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు.

గ్రామ మౌలిక వనరులపై అవగాహన

ప్రజాశక్తి-వడ్డాది : గ్రామంలో మౌలిక వసరులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం కింజారపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు అన్నారు. బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట గ్రామంలో సోమవారం గ్రామంలో ఉన్న మౌలిక వనరులను చిత్ర పటం వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో 1925లో పాఠశాల, 1961లో పిఎసిఎస్, 1975లో రసాయనాలు, 2003లో వాటర్ ట్యాంక్, 2009లో డ్వాక్రా సంఘాలు, 2011లో పాల కేంద్రం, 2013లో మరో అంగన్వాడి కేంద్రం, 2017 సిమెంట్ రోడ్లు, 2019లో రైతు భరోసా, సచివాలయాలు, 2020 హెల్త్ క్లినిక్లు ఏర్పాటు చేశారని, వీటిపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు కె.దుర్గా శ్రావణి, ఎ.మనీషా, ఈ లాస్య ప్రియ, టి.కావ్య, పి.కీర్తన, కె.అనూష, రైతులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పటం వేసి గ్రామస్తులకు వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

యుటిఎఫ్ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను సోమవారం అనకాపల్లి మున్సిపల్ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుల సమావేశం అనంతరం యలమంచిలి డిప్యూటీ విద్యాశాఖాధికారి పి.అప్పారావు, ఏడి రవిబాబు, ఏపీఓ వై.వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుల సమక్షంలో టెన్త్ క్లాస్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేందుకు యు.టి.ఎఫ్. ప్రతీ ఏడాది మోడల్ పేపర్లను ముద్రించి సేవా దృక్పథంతో అతి తక్కువ రేటుకు విద్యార్థులకు అందిస్తుందని చెప్పారు. ఈ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయులకే కాకుండా, విద్యార్థులకు కూడా సేవ చేయడం గొప్ప విషయమన్నారు. తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం మోడల్ పేపర్లను ఆవిష్కరించి, ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ కార్యక్రమంలో యు.టి.ఎఫ్. జిల్లా కార్యదర్శులు జి.ప్రకాష్, కె.సతీష్, అనకాపల్లి మండల అధ్యక్షులు మామిడి బాబూరావు, సీనియర్ నాయకులు దేముడు నాయుడు, సలీం తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు తిరిగి చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : అగ్రిగోల్డ్ బాధితులకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు డిపాజిట్లు తిరిగి చెల్లించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వైన్ భద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, స్పందనలో జాయింట్ కలెక్టర్ జాహ్నవికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక సంఖ్యలో భాదితులు ఆత్మ హత్యలు చోటు చేసుకుంటున్నాయని, ఇంకా కాలయాపన చేస్తే మరిన్ని మరణాలు పెరుగుతాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టులతో, కేసులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే బాధితులకు డిపాజిట్ల చెల్లించి న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరణం మాణిక్యాలరావు, మొల్లేటి గోపాల రమణ, జె దుర్గారావు, వై సూరిబాబు, చిన్నప్పారావు, ఈశ్వరరావు, అప్పారావు, రమణమ్మ రైతు సంఘము నాయకులు శంకరరావు, కాంగ్రెస్ నాయకులు రామునాయుడు, సిపిఐ మండల కార్యదర్శి చెల్లూరు నాగరాజు, బాధితులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రానున్న ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాలోని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ముందస్తు ఏర్పాట్ల గురించి సమీక్షించారు. 22, 23 తేదీలలో జరిగే కేంద్ర ఎన్నికల కమిషన్ సమావేశానికి అన్ని రికార్డులు సిద్ధం చేయాలన్నారు. అనకాపల్లి నుండి జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీ, మార్పులు చేర్పులు తొలగింపులు చేస్తున్నామని, పోలింగ్ కేంద్రాల తనిఖీ చేసి వాటి పరిస్థితిని బట్టి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి. దయానిధి, సిపిఓ జి రామారావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డిటి రవికుమార్ పాల్గొన్నారు.

నేడు ఆర్ఎఆర్ఎస్‌లో కిసాన్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం కిసాన్ మేళా జరుగుతుందని ఆర్ఎఆర్ఎస్ ఎడిఆర్ డాక్టర్ పివికె జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 64వ కిసాన్ మేళాలో ప్రధానంగా చెరకు, చిరుధాన్యాల దిగుబడి పెరుగుదలకు సాంకేతిక పరిజ్ఞానం అంశంపై నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం రెండున్నర నుంచి ఐదు గంటల వరకు రైతులతో శాస్త్రవేత్తలు చర్చ గోష్టి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ఎంపిడిఒ కార్యాలయానికి చేరిన చెత్త సేకరణ బుట్టలు

కె.కోటపాడు : ఇళ్లలోని తడి పొడి చెత్తను వీధుల్లో వేయకుండా వాటిని సక్రమంగా ప్లాస్టిక్ బుట్టలో వేయుటకు ప్రతి ఇంటికి రెండు ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ చేయుటకు ఎంపీడీవో కార్యాలయంలో బుట్టలను సిద్ధం చేశారు. 23000 ప్లాస్టిక్ బుట్టలను స్వచ్ఛ భారత్ మిషన్‌లో మండలానికి అందజేయడం జరిగింది. వీటిని మండలంలో ఉన్న 32 పంచాయతీలకు ఇంటికి రెండు చొప్పున పంపిణీ చేస్తారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ఆదేశాలతో వీటిని ప్రతి గ్రామ పంచాయతీలకు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది తెలిపారు.

తిరస్కరించిన అర్జీలకు వివరణ ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలలో తిరస్కరించిన వాటిలో అందుకు గల కారణాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించాలన్నారు. ఈరోజు స్పందనకు 360 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డుల దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, డిఆర్ఓ బి.దయానిధి, ఈ ఎస్ డబ్ల్యూ ఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎంపీపీ 1, 3 పాఠశాలల పిల్లలకు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన సదస్సు, పరీక్షలు జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాథం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విటమిన్ - సి, కాల్షియం ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఫ్లోరోసిస్ సోకకుండా నివారించవచ్చునని తెలిపారు. ఈ వ్యాధి వలన దంతాలు , ఎముకలు దెబ్బతింటాయని, కాల్షియం అధికంగా ఉండే పాలు, గ్రుడ్లు, పెరుగు, రాగిజావ వంటి ఆహార పదార్థాలు నిత్యం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీ. అనురాధ, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం ఉమా మహేష్, ఎం ఎల్ హెచ్ పి లు సంతోషి, ఉమా చంద్రిక, ఏఎన్ఎం లు ఆదిలక్ష్మి, దేవకీ, రేవతి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ఇకపై రూ.25 లక్షల వరకు చికిత్స పొందవచ్చని, కుటుంబంలో ఒక్కరైనా ఆరోగ్యశ్రీ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఎవరికైనా అనారోగ్య సమస్య ఎదురైనా, దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురైనా ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా చికిత్స పొందవచ్చునని, చికిత్సకు అయ్యే ఖర్చు రూ.25 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఇప్పుడు ఆరోగ్య శ్రీ ద్వారా క్యాన్సర్, గుండె మార్పిడి చికిత్సలు కూడా చేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యం పొందడం మరింత సులభతరం చేయడం జరిగిందని, 104 కాల్ సెంటర్, హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఆరోగ్యశ్రీ సేవలు పొందవచ్చన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఇప్పుడు స్మార్ట్ కార్డుగా రూపొందించడం జరిగిందని అందులో కార్డుదారుడి ఆరోగ్య విషయాలు అన్నీ ఉంటాయని చెప్పారు. ప్రభుత్వం ఇప్పుడు ఆరోగ్య ఆసరా పథకాన్ని కూడా ప్రారంభిస్తున్నదని, ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన తరువాత విశ్రాంత సమయంలో జీవనోపాధి కోల్పోయే పరిస్థితి కలగకుండా ఉండేందుకు రూ.5వేలు వరకు ఆర్థిక సహాయం బ్యాంకు ఖాతా ద్వారా అందిస్తారని చెప్పారు. ఈ పథకంలో 1519 రకాల చికిత్సలకు ఈ సహాయం వస్తుందన్నారు. అంతకుముందు జిల్లా ఎస్పీ కె.వి మురళీకృష్ణ తో కలిసి ఆయన ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. తరువాత ఆరోగ్యశ్రీ సేవలను గూర్చి తెలియజేసే ఫోల్డర్ విడుదల చేశారు. డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఏ.హేమంత్, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, డిఎల్ .ఓ డాక్టర్ బాలాజీ, డిఎన్ఎంఒ డాక్టర్ కిషోర్ కుమార్, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, అనకాపల్లి ఎంపిపి గొర్లె సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య శ్రీ కార్డ్ ద్వారా ఉచిత వైద్యాన్ని 25 లక్షల రూపాయలకు పెంచుతూ అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వర్చ్యువల్ ద్వారా లాంఛనంగా ప్రారంభించగా, మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరవాడ మండల ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు వీక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, కోన రామారావు, వెన్నెల అప్పారావు, ఎంపిడిఓ హేమ సుందరరావు, తాసిల్దార్ కనకరావు, పిహెచ్ సి డాక్టర్ కనక అప్పారావు, బొద్దపు చిన్నారావు, వరి హరి, పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, ఎస్‌పి, నర్సీపట్నం ఎమ్మెల్యే

అవగాహన కల్పిస్తున్న అధికారులు

జగనన్న పాల వెల్లువపై అవగాహన

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మండల మహిళా సమాఖ్యలో జగనన్న పాలవెల్లువ ద్వారా అమూల్ డెయిరీకి పాలు పోసిన మహిళా రైతులకు, విఐఎలకు సోమవారం అవగాహన కల్పించారు. మండల పశు వైద్యులు అల్ఫెన్స్ జార్జి, చైతన్యమణి మాట్లాడుతూ సహకార సంఘాలు ఏర్పాటు విధానం ,జగనన్న పాల వెల్లువ పురోగతి, రుణాలు, మహిళా రైతులకు లాయల్టీ బోనస్‌లు, బీమా, పశుగ్రాసం, పశు పోషణ, పశువులు కొనుగోళ్ల వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల మహిళ సమాఖ్య ట్రెజరర్ జి.పార్వతి, ఏపిఎం శ్రీనివాసరావు, సీసీలు, విఐఎలు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయితీ శివారు లగుడువారి ఇండ్లు దగ్గర అతి పురాతన దేవాలయం స్వయంభు శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీలక్ష్మీ ఎంటర్ ప్రైజెస్ అధినేత, రాష్ట్ర వైసిపి కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు లక్ష్మీ దంపతులు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, జ్యోతి దంపతులు సోమవారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి సందర్భంగా రూ.2 లక్షలు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయానికి గ్రానైట్, స్వామి విరాట్ విగ్రహానికి వెండి తోరణం తమ వంతు సహాయంగా అందజేస్తామని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు చొక్కాకుల వెంకటరావు దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వెన్నెల సత్యనారాయణ, లగుడు ముత్యాలనాయుడు, లగుడు సూర్యనారాయణ, వనం చెల్లారావు, లగుడు దేముడుబాబు , లగుడు దేవుడుబాబు (పోలీస్), లగుడు మహేష్ పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి గ్రామంలో చిన్నంనాయుడు నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ ఎస్ పెంటమ్మ, నాయకులు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, నాయుడు, గుండు రాంబాబు, వాలేటి నాగరాజు, సోమిరెడ్డి పేరునాయుడు, దివి శంకర్రావు, ఎడ బంగారయ్య, వరదపురెడ్డి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంధనం పొదుపుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-సబ్బవరం : ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ చేపట్టిన విద్యుత్ వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో స్థానిక ఎపిఈపిడిసిఎల్ ఆధ్వర్యంలో ఇంధనం పొదుపుపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఏడిఏ నిరీక్షణ్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుండి ఎన్టీఆర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, విద్యుత్ ఆదా చేయాలని నినాదాలు చేశారు విద్యుత్ పొదుపునకు పాటించాల్సిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈలు అశోక్ కుమార్, వీరేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : చోడవరం పంచాయితీ పరిధి అన్నవరం గ్రామానికి చెందిన ఎం.లక్ష్మి (36) అనుమానస్పదంగా మృతి చెందింది. ఈమెకు ధనుష్, హర్ష ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త శ్రీనివాస్ పరారీలో ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పరవాడ : శ్రీకాకుళం జిల్లా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్ జిల్లా పరిషత్‌లో జరిగిన సెకండ్ నేషనల్ ఓపెన్ చాంపియన్ షిప్- 2023 పోటీలలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం, సమ్మంగిపాలెం, జాలారిపేట కోరంగిపాలెం, మంగప్పగారివూరు గ్రామాలకు చెందిన డ్రాగన్ లైన్స్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన ఒలిశెట్టి జోష్ని, కణితి నిఖిల్, కణితి యశ్వంత్, పిడిమి ప్రకాష్, కృష్ణ మాదవి, అశోక్, రోహిత్, తేజ, ఆదిత్య, ప్రథమ, తృతీయ, ద్వితీయ స్థానాలలో గెలుపొందారు. ఈ కార్యక్రమంలోగ్రాండ్ మాస్టర్ , యస్ నూకరాజు, ఒలిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న టిడిపి నేత నాగజగదీశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 20న విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో జరుగు ముగింపు, ఎన్నికల శంఖారావం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం ముగింపు సభను జయప్రదం చేయడం ద్వారా అధికార వైసీపీకి జగన్ రెడ్డికి నిద్ర లేకుండా చేయాలన్నారు. అనకాపల్లి జిల్లాలో యువగళం పాదయాత్ర జయప్రదానికి కృషి చేసిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ కేకేవిఏ నారాయణరావు, మాదంశెట్టి నీలబాబు, కోట్ని రామకృష్ణ, బొడ్డేడ మురళి, సాలాపు నాయుడు, మళ్ల శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : యువగళం పాదయాత్రలో భాగంగా ఈనెల 20న భోగాపురంలో జరిగే ముగింపు సభకు భారీగా పార్టీ శ్రేణులు కార్యకర్తలు ప్రజలు తరలిరావాలని టిడిపి మండల నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరకాన సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక దేవరపల్లిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండారు రామారావు, చల్ల నానాజీ, దోగ దేవుడు నాయుడు, అంజి, కొల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

బహుమతులు చూపుతున్న విద్యార్థులు

విలువలతో కూడిన విద్య పునరుద్ధరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మానవతా విలువలతో కూడిన విద్య లోపిస్తున్నందున, దాని పునరుద్ధరణకు శ్రీసత్యసాయి సేవాసంస్థలు విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవ సంస్థలు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వైశ్యరాజు కృష్ణరాజు అన్నారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో పాఠశాల, మండల స్థాయిల్లో విజేత విద్యార్థులకు సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కశిరెడ్డి అప్పలనాయుడు, భజన మండళ్ల మండల ఇన్చార్జి కన్నూరు అప్పలనాయుడు, హెచ్ఎం పద్మ, కన్వీనరు బండారు నారాయణపాత్రుడు, చిరికి రామారావు, ఇన్చార్జి హెచ్ఎం హిమబిందు, ఉపాధ్యాయులు మురళి, కామేశ్వరరావు, సత్యంనాయుడు మంగునాయుడు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

ప్రజాశక్తి -అనకాపల్లి : సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉందని, పథకాల కొనసాగింపుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మరో అవకాశం ప్రజలు ఇవ్వాలని వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏపి ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద హాజరయ్యారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మా నమ్మకం నువ్వే జగనన్న బోర్డు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు రాపేటి నాగేశ్వరరావు, సీతానగరం సర్పంచ్ సుంకర చంటి, బాధపు లక్ష్మీ తాతారావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ దాడి రమేష్, ఆడారి సూరి అప్పారావు పాల్గొన్నారు.

కెంఎన్ఆర్ పేటలో...

జీవిఎంసీ 84వ వార్డు కేఎన్ఆర్ పేట సీరసపల్లి సచివాలయం 25 పరిధిలో సోమవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గైపూరి రాజు, ఈగల మహేష్, కరణం సురేష్, గొర్లె లక్ష్మి పాల్గొన్నారు.

కశింకోట : మండలంలో తాళ్ళపాలెం గ్రామ సచివాయం-2 వద్ద మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు, మండల వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు మలశాల కిషోర్, ఎంపీటీసీ లగిసెట్టి భవానీ గణేష్, కార్యదర్శి సత్యారావు, ముసిలి నాయిడు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా వారి పిల్లలను వివిధ రంగాల్లో ప్రోత్సహించాలని ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా సమన్వయ అధికారిణి శకుంతల సూచించారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని సోమవారం అనకాపల్లి మండల పరిధిలో జడ్పీహెచ్ఎస్ కొప్పాక కాంప్లెక్స్‌లో గల భవిత కేంద్రంలో నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సుమమణి ప్రధానవక్తగా విభిన్న ప్రతిభావంతులు సాధించిన విజయాలకు సంబంధించి స్ఫూర్తివంతమైన ప్రసంగం ఇచ్చారు. అనకాపల్లి మండలంలో గల విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సుమారుగా 120 మంది ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమ నిర్వహణకు లంకెలపాలెనికి చెందిన సిహెచ్ కోటేశ్వరరావు ఆర్థిక సహాయ సహకారాలు అందించారు. 60 మంది విద్యార్థులకు నాణ్యమైన దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజన వసతిని ఏర్పాటు చేశారు. మామిడిపాలెం జడ్పీహెచ్ఎస్ ప్రత్యేక ఉపాధ్యాయులు బివి వరప్రసాద్, మండల ఐఈఆర్‌పి టీచర్లు యేసు రత్నం, రమాదేవి పాల్గొన్నారు.

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

పరవాడ : అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పరవాడ భవిత సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. వికలాంగులకు పలు రకాల క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. లుపిన్ ఫార్మా కంపెనీ రూ.60 వేలతో పెయింటింగ్స్‌ను ఇనాగరేషన్ చేశారు. వికలాంగుల తల్లిదండ్రులు, యొక్క పిల్లలకు ఈ భవిత సెంటర్ ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను ఉపాధ్యాయిలిస్తున్న శిక్షణను వివరించడం జరిగింది. ఎంఈఓలు 1, 2 సాయి శైలజ, దివాకర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్న సహిత విద్య కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లుపిన్ కంపెనీ లిమిటెడ్ సైట్ హెడ్ రాజేష్, డీజీఎం హెచ్ఆర్ఎం శ్రీనివాస్, సిఎస్ఆర్ మేనేజర్ వెంకట్ పాల్గొని రూ.60 వేలు ఖర్చుతో వేయించిన పెయింటింగ్స్ యొక్క డాక్యుమెంట్స్‌ను భవిత ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో జివిఎంసి 79వ వార్డు నాయకులు వినోద్ కుమార్, భవిత ఉపాధ్యాయులు టి కుమారి, శ్రీనివాస్‌రావు, నితిన్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-మాకవరపాలెం:మిచౌంగ్ తుపాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి, జనసేన నాయకులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం వారు తహశీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాకవరపాలెం మండలంలో అన్ని గ్రామాలలో వరి పండించిన ప్రతీ రైతు మిచాంగ్ తుపాన్‌తో పూర్తిగా నష్టపోయారన్నారు. తుపాన్‌తో మండలంలో 2వేల ఎకరాల వరి పంట దెబ్బతిందన్నారు. 10 రోజులు కావస్తున్నా నష్టాన్ని సర్వే చేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. పంట నష్టపరిహారం కింద వరి రైతులకు ఎకరానికి 30వేలు ఇవ్వాలన్నారు. తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేసి క్వింటాకు 3వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆర్వై.పాత్రుడు, పార్టీ ఉపాధ్యక్షులు కేతిరెడ్డి చిరంజీవి, జనరల్ సెక్రటరీ ఒబ్బలరెడ్డి గోవింద, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, జనసేన పార్టీ కార్యదర్శి సప్పా నానాజీ, జిల్లా సంయుక్త కార్యదర్శి నమ్మి రమణరాజు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న టిడిపి, జనసేన నేతలు

మాట్లాడుతున్న రామానాయుడు

చంద్రబాబుతోనే అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

ప్రజాశక్తి-చీడికాడ: టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తెలిపారు. సోమవారం ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సభ పోలవల్లిలో నిర్వహిస్తున్నారని, మాడుగుల నియోజకవర్గం నుండి సుమారు 5 వేలు మంది కార్యకర్తలు హాజరయ్యేటట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. రైతుల పట్టా భూముల పాసు పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మ వేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ఆంధ్ర రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం కావాల్సిన అవసరం ఉందన్నారు.పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిన్ననాయుడు, కార్యదర్శి తాతారావు, ఎంపిటిసిలు పెద్ది నాయుడు, గాడి నాగరత్నం, కోటేశ్వరరావు, పైలా ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -కొత్తకోట:మేజర్ పంచాయతీ కొత్తకోట రోడ్డు విస్తరణ పనులు సోమవారం ప్రారంభం అయ్యాయి. గత కొంత కాలంగా రోడ్డు విస్తరణ పనులు జరగక పోవడంతో ఆదివారం చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరిశీలించారు. పనులు తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం స్థానిక పంచాయతీ పాలకులు జేసిబితో రహదారికి ఇరువైపులా ఉన్న నిర్మాణాల తొలగింపు ప్రక్రియ ప్రారంభించారు. ఈ పనులను గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్య దేవ్, ఎంపిటిసి పూడి దేవ, జెడ్‌పిటిసి భర్త తలారి ఆదిమూర్తి, వైసిపి నాయకులు శీలం శంకర రావు తదితరులు పర్యవేక్షించారు.

పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి-రావికమతం:ఇటీవల తుపానుకు నష్టపోయిన పంట పొలాలను మండల కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సోమవారం మండల కమిటీ సభ్యులైన వ్యవసాయాధికారిణి డి.రూప, తహసిల్దార్ ఎస్‌వి మహేశ్వరరావు, ఎంపిడిఓ వెంకన్నబాబులు కవగుంట, గుమ్మాలపాడు చినపాచిల, కమీర గ్రామాల్లో పర్యటించారు.కవగుంట గ్రామంలో భారీగా నష్టపోయిన పంట పొలాలను సర్పంచ్ దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. పూర్తిస్థాయిలో వరి పంట నీట మునిగి, నేల కొరిగి మొలకెత్తితే న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే పంట పొలాలను ఆర్బికే సిబ్బంది నష్టపోయిన రైతులను గుర్తించడం జరిగిందన్నారు. సర్పంచ్, సచివాలయ కన్వీనర్ మాట్లాడుతూ, తుపానుతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికే ఇంచార్జ్ శరత్ కుమార్, మాధురి, సత్యనారాయణ, సాగర్, విఆర్ఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో.. విభిన్న ప్రతిభావంతులు రాణించాలి

వీల్ చైర్స్ అందజేస్తున్న ఎంపిడిఓ శ్రీనివాస్

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఓ శ్రీనివాస్ మాట్లాడుతూ, దివ్యాంగులు ఆత్మస్థైర్యం, పట్టుదలతో అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు.ఎంతోమంది వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఈఓ నరేష్ మాట్లాడుతూ, దివ్యాంగులు మానసిక ధృఢత్వంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏమీ ఉండదన్నారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్ళు, ట్యాబ్‌లు అందించారు. ఆటలు, పాటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి బి.సత్యనారాయణ, స్థానిక హైస్కూల్ హెచ్ఎమ్ రాణీలలిత, స్పెషల్ ఎడ్యుకేటర్ షేక్ యాస్మిన్, తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు అరుణ,గౌరి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న పశువైద్య శాల సహాయం సంచాలకులు

పశు వైద్యశాలలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని ఖండివరం పశు వైద్య శాలను మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశు విజ్ఞాన బడి, వై యస్ ఆర్ సంచార పశు వైద్యసేవలపై పాడి రైతులందరికీ తెలియజేయాలని ఖండివరం పశు వైద్యాధికారి గణేష్ ను ఆదేశించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం కింద పాడి రైతులకు 35 శాతం సబ్సిడీ పై 2 లక్షల వరకు ఋణ సదుపాయం, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద 50 శాతం సబ్సిడీ పై 20 లక్షల నుండి 1 కోటి రూపాయలు వరకు ఇచ్చే రుణాలపై తెలియజేయాలన్నారు. రైతులను సంబంధిత బ్యాంకులకు పంపించి, ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొనేటట్లు పశు సంవర్ధక శాఖ సిబ్బంది రైతులకు వివరించాలని ఆదేశించారు.

వైద్యానికి సిఎం జగన్ పెద్దపీట

ప్రజాశక్తి-గొలుగొండ:ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ రూ.25లక్షల వరకు ఉచిత వైద్యం పెంపు హర్షణీయమని గొలుగొండ జెడ్పిటిసి సుర్ల గిరిబాబు అన్నారు. సోమవారం చీడిగుమ్మలలో ఈ కార్యక్రమంకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం జెడ్పిటిసి మాట్లాడుతూ, సిఎం జగన్ వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని మరింత చేరువ చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ పథకంకు 25లక్షల వరకు ఉచిత వైద్యం పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మధుసూధనరావు, నాయకులు పాల్గొన్నారు.

కోటవురట్ల: పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సందేశాన్ని వినిపించారు. ఆరోగ్య శ్రీ ద్వారా అందే వైద్య పథకాలు ప్రజలకు అధికారులు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కాశీ విశ్వనాథరావు, ఈఓపిఆర్‌డి భానుజీరావు పాల్గొన్నారు.

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జెడ్‌పిటిసి గిరిబాబు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత


సీతమ్మధారలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న కెకె రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : 55వ వార్డు కార్పొరేటర్ కెవిఎన్ శశికళ ఆధ్వర్యంలో ధర్మానగర్ శివాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఏపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె రాజు పాల్గొని వైసిపిపాలనలో సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ వివరాలు బోర్డును, అలాగే పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభలో మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కెపి రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, జెసిఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, వార్డు నాయకులు వై.సిద్ధార్థరాజు, గంగా మహేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, బద్రి, సొండి ప్రసాద్, పోలరాజు, కరుణ, లక్ష్మి, నాగలక్ష్మి, అనురాధ, పద్మ పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలోని కొడవటిపూడి గ్రామంలో మండల వైసిపి అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోసూరి అప్పారావు, ఈఓపిఆర్డి బానోజీరావు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కొడవటిపూడిలో సమావేశానికి హాజరైన నాయకులు

బాడీ బిల్డింగ్ పోటీల్లో రాంకీ సత్తా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఆంధ్రప్రదేశ్ 6వ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో నర్సీపట్నం మున్సిపాలిటీ 3వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన మర్రా రమణ కుమారుడు మర్రా రాంకీ అద్భుత ప్రతిభ కనబర్చారు. అనకాపల్లి గవరపాలెంలోని వివి.రమణ రైతు భారతి ఆడిటోరియంలో ది అనకాపల్లి బాడీ బిల్డర్స్, ఫిట్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఆదివారం ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రామ్ పాల్గొని 55 కేజీల విభాగంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

గెలుపొందిన మర్రా రాంకీ

కృష్ణవేణిని అభినందిస్తున్న డైరెక్టర్, కోచ్

నేషనల్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈనెల 21 నుండి 26 వరకు ఉత్తర ప్రదేశ్‌లో జరుగనున్న 7వ సీనియర్ నేషనల్ బాక్సింగ్ పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ టీం తరపున నర్సీపట్నం బాక్సర్ కోలుకుల కృష్ణవేణి 66 కేజీల విభాగం సీనియర్ ఉమెన్ కేటగిరిలో ఆడుతున్నారు. ఆమె గత నెలలో విశాఖలో సీనియర్ స్టేట్‌లో గోల్డ్ మెడల్ సాధించి ఈ టోర్నమెంట్‌కి అర్హత సాధించారు. ఈ సందర్భంగా కృష్ణవేణిని నింజాస్ అకాడెమీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, వెలగా జగన్నాద్ అభినందించారు. శాప్ కోచ్ అబ్బూ మాట్లాడుతూ, ఈమె సీనియర్ నేషనల్‌తో పాటు సౌత్ జోన్ నేషనల్ యూనివర్సిటీ పోటీలకు వెళుతుందని, అవి ఈనెల 28 నుండి ఫిబ్రవరి 1 వరకు కూడా పంజాబ్‌లో జరుగుతాయన్నారు.

నిరసన చేపడుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ హక్కుల చట్టం (ఎ.పి ల్యాండ్ టైటిలింగ్ చట్టం 27, 2023)ను వెంటనే రద్దు చేయాలని నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసయేషన్ ప్రెసిడెంట్ రావాడ సత్యనారాయణ మాట్లాడుతూ,ఈ చట్టం ప్రకారం ప్రజల స్థిరాస్థుల విషయంలో వివాదాలు ఏర్పడినప్పుడు వాటిని పరిష్కరించే అధికారం సివిల్ కోర్టుల పరిధి నుండి తప్పించి ప్రభుత్వం ఏర్పాటు చేసే జిల్లా స్థాయి ట్రిబ్యూనల్‌కు అధికారాలు ఇచ్చిందన్నారు. ట్రిబ్యూనల్ ఉత్తర్వులపై నేరుగా హైకోర్టుకు మాత్రమే అప్పీలు చేసుకునే అధికారాలు ఇచ్చారన్నారు. సామాన్యులు హైకోర్టులో పిటిషన్ వేసుకోవడానికి చాలా డబ్బు ఖర్చు పెట్టడమే కాకుండా చాలా ప్రయాస పడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఇటంశెట్టి సూరిబాబు, సీనియర్ న్యాయవాది పొక్కునురి నాగేశ్వరరావు, మెట్టా ప్రబాకర్, నరసింహం, అనిమిరెడ్డి గోవిందరావు, కెఆర్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కదంతొక్కిన అంగన్వాడీలు

పలు చోట్ల భారీ ర్యాలీలు, ధర్నాలు

నర్సీపట్నంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

విశాఖలో మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

ప్రభుత్వం అంగన్‌వాడీలపై బెదిరింపు చర్యలకు పాల్పడినా ఆందోళనలతో ముందుకు సాగుతున్నారు. అనకాపల్లి, విశాఖ జిల్లాలోని పలు చోట్ల అధికారులు కేంద్రాలకు తాళాలు వేస్తుండటంతో ఆయా పార్టీల నేతలు, గ్రామస్తులు అడ్డుకున్నారు.

అనకాపల్లి:దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఏడు రోజులుగా సమ్మె అంగన్వాడీలు సోమవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ముందుగా పట్టణంలో భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి, తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లకు ఇవ్వాలని, ఐసిడియస్‌కు బడ్జెట్ పెంచాలని, ప్రీస్కూల్ బలోపేతం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నాగశేషు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, యూనియన్ నాయకులు కె.కాసులమ్మ, కె.రామలక్షి, కె.తనుజ, బి జయలక్ష్మి కె.కృష్ణవేణి, భవాని, ఎం. రమణి, ఎం. వరలక్ష్మి, గంటా శ్రీరామ్, బుగిడి నూకప్పారావు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : అధికార వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని సిఐటియు మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ టిడిపి, జనసేన పార్టీల మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాములు అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీపీ స్కూల్లోని అంగన్వాడీ కేంద్రాన్ని తెరిచేందుకు వెళ్లిన ఎండిఓ మన్మథరావు, డిటి వినయ్ కుమార్, సచివాలయ బృందాన్ని వారు అడ్డుకున్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ అన్నపూర్ణ, సచివాలయ కానిస్టేబుల్ వరలక్ష్మి, వాలంటీర్లతో వాగ్వాదానికి దిగారు. తలుపులకు అడ్డంగా కూర్చొని నినాదాలు చేశారు. తలుపులు తెరిస్తే ప్రతిఘటన చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో పోలీసులను రప్పించి వారి సహాయంతో సుత్తితో తాళం కప్పను విడగొట్టి తలుపులను తెరిచారు. టిడిపి సీనియర్ నాయకులు దాడి ముసలి నాయుడు, జనసేన పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంతు రైతు సంఘం నాయకులు ఆడారి మహేష్, ఆడారి లక్ష్మణరావు, దాడి శివ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని బలవంతంగా తెరిచిన అధికారులు

బుచ్చయ్యపేట : ఏడు రోజులుగా వారు సమ్మెలో పాల్గొంటే అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి కేంద్రాలను స్వాధీనం చేసుకోవడంలో అధికారులు నిమగ్నమయ్యారు. మండలంలో 62 అంగన్వాడీ కేంద్రాలకు సోమవారం నాటికి 30 అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి డ్వాక్రా సంఘాలకు అప్పగించారు. సోమవారం మండలంలోని వడ్డాదిలో ఐదు అంగన్వాడీ కేంద్రాల

వడ్డాదిలో తాళాలు పగులగొట్టిన సచివాలయ సిబ్బంది

తాళాలను పగలగొట్టి ఈవో లవరాజు సరుకులను స్వాధీనం చేసుకున్నారు. అయితే అంగన్వాడీ కేంద్రాలను తెరిసినా తల్లిదండ్రులు తమ పిల్లల ఏమాత్రం పంపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పిల్లల తల్లిదండ్రులు, అధికారుల చర్యలను అడ్డుకుంటున్నారు.

నక్కపల్లి:అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సింది పోయి అంగన్వాడీ కేంద్రాలను అధికారులతో బలవంతంగా తెరిపించే ప్రయత్నంకు ఎక్కడికక్కడ ప్రతిఘటన ఎదురైంది. మండలంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అంగన్వాడి కేంద్రాలను తెరిపించేందుకు ప్రయత్నం చేయగా టిడిపి శ్రేణులు, కొంతమంది స్థానికులు అడ్డుతగిలారు. చందనాడ, న్యాయంపూడి, బంగారమ్మపేట, రేబాక, రమణయ్యపేట, గుల్లిపాడు, బుచ్చిరాజుపేట, ఎన్ నర్సాపురం, కాగిత, నెల్లిపూడి, అమలాపురం, తదితర గ్రామాల్లో టిడిపి శ్రేణులు అంగన్వాడీ కేంద్రాలను తెరవకుండా అడ్డుకున్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే వరకు కేంద్రాలను తెరవనీయబోమని స్పష్టం చేశారు.

నర్సీపట్నం టౌన్ :అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో నర్సీపట్నం ప్రధాన రహదారులు ఎర్ర జెండాలతో జన సముద్రం గా మారింది. 7వ రోజు నిరసనలో భాగంగా ఆర్‌డిఓ కార్యాలయం వద్ద సోమవారం దర్నా విజయవంతమైంది. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు నినాదాలతో బ్యారీ ర్యాలీగా వచ్చి కార్యాలయం ముందు బైఠాయించి దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికలలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు మరచి సమ్మెలో ఉన్నవారిని బెదిరించి, భయబ్రాంతులతో విచ్చినం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు.

భీమిలిలో...

ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాతూ,అంగన్‌వాడీలపై వైసిపీ ఎమ్మెల్యేలు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని, నోరు అదుపులో లేకపోతే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ, అంగన్‌వాడీలపై జగన్ మోహన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గారాణి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న, నాన్ షెడ్యూల్ గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.గోవిందరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, మండల కన్వీనర్ ఈశ్వరరావు, వి.సామ్రాజ్యం, మహాలక్ష్మీ, సిహెచ్.బ్రమరాంబ, మంగ, పద్మజ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరు దారుణం

రావికమతం:పంచాయతీ, రెవెన్యూ అధికారులను పంపించి అంగన్వాడి కేంద్రాల తాళాలు బద్దలు కొట్టించడం చాలా దారుణమని రావికమతం మండల జనసేన పార్టీ నాయకులు గంజి శ్రీనివాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అంగన్వాడీలకు గ్రాడ్యుటి ఇవ్వాలని, ఆరు నెలల నుండి పెండింగ్లో పెట్టిన సెంటర్ అద్దెలు, టిఏ బిల్లులు తక్షణం చెల్లించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు, ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ రద్దు చేయాలని, బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అడ్డుకుంటున్న ఎంపీటీసీ సూర్యారావు..

కోటవురట్ల:మండలంలో అంగన్వాడి కేంద్రాలు తెరవకుండా గ్రామాలలో ప్రతిపక్ష నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు నిలువరించారు.పందూరు గ్రామంలో తహసిల్దార్ జానకమ్మ సిబ్బందితో రెండు కేంద్రాలను దగ్గర ఉండి తెరిపించారు. మండల కేంద్రంలో ఎంపీటీసీ సూర్యారావు అంగన్వాడీ కేంద్రాలను తెరిచేందుకు వీలులేదని సిబ్బందిని అడ్డుకున్నారు.

ఎయస్.రాయవరం:అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుండటంతో ఆ బాధ్యతలను వాలంటీర్లకు ప్రభుత్వం అప్పగించినట్లు నక్కపల్లి ఐసిడియస్ సూపర్ వైజర్ యంబి నిషా తెలిపారు. సోమవారం మధ్యాహ్నం కొరుప్రోలు గ్రామంలోని మూడు అంగన్వాడీ సెంటర్లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు గ్రామస్థులతో కలిసి తాళాలు బద్దలు కొట్టారు. ఆమె వెంట కార్యదర్శి రామలక్ష్మి, ఇంఛార్జ్ మహిళా పోలీసు నాగ సోమేశ్వరి ఉన్నారు.

కొత్తకోట:తమ న్యాయమైన సమస్యల పరిష్కరించా లని కోరుతూ సమ్మె చేస్తుంటే అధికారులతో తాళాలు పగలగొట్టడం దుర్మార్గపు చర్యని టీడీపీ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేసారు.మండలంలో పలు గ్రామాలలో సచివాలయం సిబ్బందిఅంగన్వాడీ కేంద్రాల తలుపులు పగలగొట్టారు. కొత్తకోట గ్రామంలో అంగన్వాడీ కేంద్రం - 2 సెంటర్లో తాళాలు పగలగొట్టేందుకు వచ్చిన కార్యదర్శి కృష్ణమోహన్, ఐసిడియస్ సూపర్‌వైజర్ విజయ, వి ఆర్ఓ లక్ష్మి, సచివాలయం సిబ్బంది తలుపులు పగలగొట్టారు. కొత్తకోట గ్రామంలో అంగన్వాడీ కేంద్రం -2 సెంటర్లో తాళాలు పగలగొట్టేందుకు వచ్చిన కార్యదర్శి కష్ణమోహన్, ఐసిడియస్ సూపర్‌వైజర్ విజయ, వి ఆర్ఓ లక్ష్మి, సచివాలయం సిబ్బందిని, పలువురు గర్భిణీ, బాలింతలు, పిల్లల తల్లులు అడ్డుకున్నారు. 4వ కేంద్రం వద్ద టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు కోట సత్తిబాబు, ఉగ్గిన శ్రీను పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. వారి పోరాటానికి జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, హెచ్‌పిసిఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఆంధ్ర యూనివర్సిటీ మాజీ ఆచార్యులు ఎస్.సూరప్పడు, యుటియుసి నాయకురాలు ప్రమీల, ఎఐడిఎస్ఓ జిల్లా అధ్యక్షులు అభిలాష్, ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సూర్యప్రభ, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మద్దతు తెలిపారు.

తగరపువలస : సమస్యల పరిష్కారానికి ఏడవ రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు సోమవారం తగరపువలసలో భారీర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎఐటియుసి ఆధ్వర్యాన చిట్టివలస సిఐటియు కార్యాలయం నుంచి ప్రారంభమైన, పట్టణ పురవీధుల మీదుగా తగరపువలస జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో సిఐటియు భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె వెంకటలక్ష్మి, నాయకులు శ్రీదేవి, లక్ష్మి, పద్మావతి, ఎఐటియుసి నాయకులు అనురాధ పాల్గొన్నారు

పెందుర్తి : అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారంపెందుర్తి కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసరావు, వైరాంబాబు మద్దతు తెలిపారు. ఏడురోజులుగా అంగన్వాడీలు రోడ్డెక్కి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని, దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటుందని సిపిఐ నేతలు హెచ్చరించారు. అంగన్వాడీయూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బృందావతి, భవానీ, దేవి పాల్గొన్నారు.

మూతపడ్డ పందిమెట్ట అంగన్‌వాడీ కేంద్రం